www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 6 జూన్ 2025




కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత : వైసిపి


ప్రజాశక్తి - కడప

కూటమి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ప్రజలు పెద్ద ఎత్తున చాటారని వైసిపి జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం వైసిపి కడప జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెన్నుపోటు దినం నిరసన ర్యాలీని జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఏ నియోజకవర్గంలో చూసుకున్నా వేలాది మంది కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా ర్యాలీ లో పాల్గొన్నారు అన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో ప్రజలను మోసం చేసిందని అన్నారు. చంద్రబాబు నాయుడు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు అన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేయకపోగా రాష్ట్ర అభివృద్ధిని విస్మరించారని విమర్శించారు. నిరసన ర్యాలీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వామ్మో..జూన్!

- విద్యా సంస్థలకు ఆదాయం
- తల్లిదండ్రులకు వ్యయం
- అరకొర ఆదాయం.. మధ్య తరగతి సతమతం
- అందని ప్రభుత్వ సాయం
- తల్లికి వందనం కోసం ఎదురు చూపులు





ప్రజాశక్తి- పులివెందుల టౌన్

ఏడాదిలో జూన్ మాసానికి ప్రత్యేక ఉంది. జూన్ మాసం వచ్చిందంటే సామాన్య, మధ్యతరగతి కుటుంబాల వారికి పిల్లల చదువులు, వారి ఫీజులు వంటి అంశాలు కళ్ల ముందు కనిపిస్తుంటాయి. వీటి నుంచి ఎలా బయటపడాలనే ఆలోచనతో సతమతమవుతుంటారు. అదే విద్యాసంస్థల యజమానులకు జూన్ మాసం అంటే మహా ఆనందం. ఎందుకంటే విద్యార్థుల నుంచి ఫీజు వసూలు మొదులుకొని పుస్తకాలు, యూనిఫామ్ ఆఫీజు ,ఇ ఫీజు అంటూ వేలకు వేలు రూపాయలు వసూలు చేసుకునే ఛాన్స్ ఉంటుంది. దీంతో జూన్ మాసం అంటే విద్యాసంస్థల యాజమాన్యానికి ఆదాయం, విద్యార్థుల తల్లిదండ్రులకు వ్యయం గాను భావించవచ్చు. ఇటీవల కాలంలో అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా బాగా చితికిపోయి ఉన్నారు. ముఖ్యంగా గత ఏడాది తీవ్ర వర్షాభావాల పరిస్థితి కారణంగా పంటలు పండక రైతు, సామాన్య, మధ్య తరగతి ప్రజానీకం ఆర్థిక పరిస్థితి పూర్తిగా దెబ్బ తింది. ప్రభుత్వపరంగా ఎలాంటి ఆర్థిక ప్రయోజనం ఆయా వర్గాలకు చేకూరిన దాఖలాలు లేవు. రాష్ట్రంలో 2024 ఎన్నికలలో కూటమి ప్రభుత్వం విజయం సాధించి, ప్రభుత్వం ఏర్పడిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం కేవలం వృద్ధులకు ఒంటరి మహిళలకు అదేవిధంగా వికలాంగులు తదితరులకు పెన్షన్ పంపిణీ మినహా ఇతర సంక్షేమ పథకాలు ఏవి కూడా ఇప్పటివరకు అందివ్వడం లేదు. ముఖ్యంగా విద్య ఆర్థిక సాయం కోసం తల్లికి వందనం పథకాన్ని మొదటి ఏడాది పూర్తిగా విస్మరించింది. దీంతో సామాన్య, పేద, మధ్యతరగతి కుటుంబాల వారు తమ పిల్లల విద్యాభ్యాసం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఈ ఏడాది జూన్ ఇప్పటికే ప్రారంభమైంది. సాధారణంగా జూన్‌లో ప్రభుత్వ , ప్రయివేట్ విద్యాసంస్థలు ప్రారంభమై తరగతులు నిర్వహించడం తెలిసిందే. దీనికి ముందే విద్యార్థుల నుంచి అన్ని రకాల ఫీజులను ఆయా విద్యా సంస్థలు ముఖ్యంగా ప్రయివేట్ విద్యాసంస్థలు ముక్కు పిండి మరీ వసూలు చేస్తుంటాయి. ఇందులో భాగంగా ఇప్పటికే విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల విద్యాభ్యాసం పట్ల ఆందోళన చెందుతూ విద్యార్థుల ఫీజులు ఎలా చెల్లించాలి. వారికి పుస్తకాలు కొనడానికి ఇతర అవసరాలు తీర్చడానికి వేలాది రూపాయలు ఎలా వ్యయం చేయాలనే ఆలోచనతో సతమతమవు తున్నారని భావించవచ్చు. ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం పట్ల తగిన ఆసక్తి లేకపోవడం, ప్రయివేట్ విద్యాసంస్థలపై ఆసక్తిని పెంచు కోవడంతో ఫీజులను చెల్లించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు నానా తంటాలు పడుతుంటారు. సాధారణంగా నర్సరీ నుంచి ఎల్‌కెజి స్థాయిలోనే విద్యార్థుల నుంచి వేలకు వేలు ఫీజులు వసూలు చేసే పనిలో ప్రయివేటు విద్యా సంస్థలు పూర్తిగా నిమగ్నమైనాయి. సాధారణంగా చిన్నపాటి ప్రయివేట్ సంస్థలోనే ఎంత లేదన్న నర్సరీ ప్రాథమిక విద్య కోసం రూ.10 వేల వరకు ఫీజులు రూపంలో వసూలు చేస్తున్నారు. ఇక కొద్దిగా గుర్తింపు పొంది పట్టణంలో ప్రయివేటు విద్యాసంస్థలలో లక్షల రూపాయలు డొనేషన్ కింద వసూలు చేస్తున్నారు. ప్రాథమిక స్థాయిలోనే ఇలా ఉంటే ఇక ఆరవ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు ప్రవేశం పొందాలంటే లక్షలకు లక్షలు ఫీజులు చెల్లించి ప్రవేశం పొందాల్సి ఉంది.

అందని తల్లికి వందనం

ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన తల్లికి వందనం హామీ ఇప్పటివరకు అందలేదు. గత ఏడాది అలాగే గడిచిపోయింది. ప్రస్తుతం జూన్ నెల 15వ తేదీకిలోపు తల్లికి వందనం పథకం కింద ప్రతి విద్యార్థికీ రూ. 15 వేలు జమ చేస్తారు. కానీ జూన్ నుంచి విద్యా సంవత్సరం ప్రారంభమై విద్యార్థుల హాజరు శాతం సాధారణంగా జూన్ నెల నుంచి పరిగణలోకి తీసుకుంటారు. అలాంటప్పుడు ఏ ప్రాతిపదికన హాజరు శాతాన్ని పరిగణలోకి తీసుకుని తల్లికి వందనం పథకాన్ని అందజేస్తారనేది ప్రశ్నార్థకంగా ఉంది. గత ఏడాది జూ౦ నుంచి మార్చి నెల వరకు పరిగణలోకి తీసుకొని తల్లికి వందనం వర్తింప చేయాలని భావిస్తే ఇంతవరకు అలాంటి సమాచారం ఏది కూడా విద్యాపరంగా తీసుకున్నట్లుగా దాఖలాలు లేవు. మరి అలాంటప్పుడు ఎలా తల్లికి వందనం అమలు చేస్తారనేది అంతుచిక్కని అంశంగా చెప్పవచ్చు. హాజరు శాతాన్ని పరిగణ లోకి తీసుకోకుండా తల్లికి వందనం కింద నగదును వారి వారి ఖాతాలకు జమ చేస్తేనే పథకాన్ని అమలు చేయడానికి వీలుంటుంది తప్ప, మరో రకంగా వీలు పడదనేది అందరికీ తెలిసిందే. మరి ఇలాంటి పరిస్థితులను తల్లికి వందనం కింద లబ్దిదారులకు నగదు ఏ విధంగా అందుతుందో వేచి చూడాల్సిందే. ఏదేమైనా జూన్ మాసం విద్యాసంస్థల యాజమాన్యాలకు ఆదాయం గాను సామాన్య పేద మధ్యతరగతి కుటుంబాల తల్లిదండ్రులకు వ్యయంగా ఉంటుందనేది వాస్తవం.

మొక్కల పెంపకం వ్యక్తిగత బాధ్యత

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్




మొక్కకు నీరు పోస్తున్న కలెక్టర్, మొక్క నాటుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

ప్రజాశక్తి-కడప అర్బన్

మొక్కలను పెంచి పచ్చదనాన్ని పంచే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగానే కాకుండా వ్యక్తిగత బాధ్యతగా స్వీకరించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. 'హరిత ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో భాగంగా ఈనెల 5 నుంచి కార్తీక మాసం వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వన మహోత్సవాన్ని గురువారం యోగివేమన యూనివర్సిటీ ప్రాంగణంలో శ్రీకారం చుట్టారు. జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ గౌరవ అతిథులుగా డిఎఫ్‌ఒ వినీత్ కుమార్ (టెరిటోరియల్), డిఎఫ్‌ఒ (సామాజిక వన్య అటవీ సంరక్షణ), కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, వైవీయూ రిజిస్ట్రార్ పద్మ, డ్వామా పీడీ అదిశేషారెడ్డి, డిపిఒ రాజ్యలక్ష్మి హాజరై.. వారి పేర్లతో కేటాయించిన స్థలంలో అడవి జాతి మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ స్వచ్ఛందంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ యజ్ఞంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రకృతి తల్లిలాంటిదని, ప్రకృతికి ప్రాణాదారం అయిన చెట్లు ప్రాణికోటికి ప్రాణాదారం అని పేర్కొన్నారు. మొక్కల యొక్క విశిష్టతను క్షుణ్ణంగా తెలియజేశారు. పర్యావరణం పరంగా గతంలో జరిగిన నష్టాలను పూరించే దిశగా ఈ తరం యువత సమాజాన్ని పునర్నిర్మించాలని పిలుపునిచ్చారు. కరోనా లాంటి విఫత్కర పరిస్థితిలో కృత్రిమ ఆక్సిజన్‌ను వేలాది రూపాయలు చెల్లించి ఎన్నో అవస్థలు పడిన పరిస్థితులను గుర్తు చేశారు. మన కుటుంబంలో పుట్టునరోజు, పెళ్లిరోజు లాంటి ప్రత్యేక రోజుల్లో వారిచేత ఒక మొక్కను నాటించే అలవాటు నేర్పించాలన్నారు.డిఎఫ్‌ఒ మాట్లాడుతూ జిల్లా విస్తీర్ణంలో అడవులు 33 శాతం విస్తరించి ఉన్నాయని, అటవీ విస్తీర్ణంలో జిల్లా అగ్రస్థానంలో ఉందన్నారు. ప్రస్తుతం అడవుల్లో 28.47శాతం ఉన్న పచ్చదనాన్ని 33శాతం పెంచేందుకు సామాజిక అడవుల పెంపకం ద్వారా, గ్రామీణ ఉపాధి హామీ పథకం భాగస్వామ్యంతో ప్రజలకు ఓ వైపు ఉపాధి కల్పిస్తూనే.. పచ్చదనాన్ని పెంచడం జరుగుతోందన్నారు. అనంతరం వనమహోత్సవం సందర్భంగా కార్యక్రమానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులతో ప్రతిజ చేయించారు. కార్యక్రమంలో యోగి వేమన యూనివర్శిటీ, అటవీశాఖ, డ్వామా, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కడప : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం థీమ్ - 2025 ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం అని తెలిపారు. కార్యక్రమంలో రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి, ఇంచార్జ్ నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి కే.సత్య కుమారి, ఏడవ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.రమేష్ కుమార్, గౌరవ సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎస్.బాబా ఫక్రుద్దీన్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ కె.ప్రతిషకుమారి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కె.భార్గవి, మూడవ అదుపు జూనియర్ సివిల్ జడ్జ్ జి.విజయలక్ష్మి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీదేవి, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కాలుష్యం కలిగించే వస్తువుల వాడకాన్ని తగ్గించాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి ఈ సందర్భంగా అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. జడ్జి మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి యొక్క బాధ్యత అన్నారు. అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పొల్యూషన్ డిపార్ట్మెంట్ వారి సహకారంతో కడప మున్సిపల్ కార్పొరేషన్ నుంచి సంధ్యా సర్కిల్, కృష్ణ సర్కిల్ నుండి మున్సిపల్ కార్పొరేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. శివానందపురం నుంచి రిమ్స్ వరకు మొక్కలు నాటారు. కార్యక్రమంలో కడప మున్సిపల్ కమిషనర్ ఎన్.మనోజ్ కుమార్ రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ ఇంజినీర్ అనిల్ కుమార్ రెడ్డి, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు చంద్రకాంతమ్మ, వినయ్ కుమార్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు ప్రవీణ్ కుమార్, రవితేజ, మునిసిపల్ అధికారులు, పానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు, ఎన్‌జిఒలు ప్రొఫెసర్లు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



తలపడుతున్న నెల్లూరు, చిత్తూరు జట్లు

94 పరుగుల తేడాతో చిత్తూరు జట్టు విజయం

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ అండర్ - 23 వన్డే క్రికెట్ టోర్నీలో భాగంగా గురువారం వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో నిర్వహించిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టుపై చిత్తూరు జట్టు 94 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 50.0 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 296 పరుగులు చేసింది. ఆ జట్టులోని లోహిత్ లక్ష్మీనారాయణ అద్భుతంగా బ్యాటింగ్ ప్రదర్శించాడు. 102 బంతులను ఎదుర్కొని 10 బౌండరీలు, 3 సిక్సర్ల సహాయంతో 112 పరుగులు (సెంచరీ) చేశాడు. నికిత్ గౌడ్ 60 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని మాధవ్ 3 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 297 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ఃకు దిగిన నెల్లూరు జట్టు 42.2 ఓవర్లలో 202 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయి ఓటమి చవిచూసింది. ఆ జట్టులోని మన్విత్ రెడ్డి 52, అర్జున్ 37 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని బాలాజీ 4, రెడ్డి ప్రకాష్ 3 ముఖేష్ 2 వికెట్లు తీసుకున్నారు.

కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో నిర్వహించిన వేరొక మ్యాచ్‌లో కర్నూలు జట్టుపై 3 వికెట్ల తేడాతో అనంతపురం జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 38.1 ఓవర్లలో 196 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని నయీముల్లా 59, కనీష్ 51 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని మల్లికార్జున 4, దీపక్ 2, షేక్ కామిల్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 197 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన అనంతపురం జట్టు 34.4 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసి 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆ జట్టులోని మహేంద్ర రెడ్డి 67, అర్జున్ టెండూల్కర్ 40 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని కనిష్ 3, సాబ్జాన్‌బాష 2 వికెట్లు తీసుకున్నారు.

బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

వైద్య ఆరోగ్యశాఖలో బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని ఎపి పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి అహరున్ కోరారు. గురువారం ఆర్‌డి రామ గిడ్డయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అహరున్ మాట్లాడుతూ ఇంకా కొన్ని కేడర్ల లాంగ్ స్టాండింగ్ సీనియార్టీ లిస్టు రావాల్సి ఉందని పేర్కొన్నారు. దీనిని సత్వరమే ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎర్రపురెడ్డి శ్రీనివాసులురెడ్డి, జిల్లా కార్యదర్శి మహబూబ్ బాష, కోశాధికారి జనార్ధన్, జోనల్ జాయంట్ సెక్రటరి రాఘవేంద్ర రాజు, సుధాకర రాజు, జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్, శ్రీనివాసులు నాయక్, జయరామయ్య, తాలూకా జాయంట్ సెక్రటరి జయరత్నమ్మ పాల్గొన్నారు.



ఆర్‌డికి వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- ధర్నాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని జిజిహెచ్‌లో పనిచేస్తున్న శానిటేషన్ సూపర్‌వైజర్, ఇద్దరు సెక్యూరిటీ గార్డ్‌లను అకారణంగా తొలగించడాన్ని నిరసిస్తూ, కార్మికులను ఇబ్బందులు గురిచేస్తున్న సుబ్బరాయుడు, బాలనారాయణరెడ్డిని అరెస్టు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. గురువారం పాత బస్టాండ్ వద్ద సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ ముఖ్యంగా డిప్యూటీ సిఎం రిమ్స్‌కు వచ్చినప్పుడు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎ1, ఎక్స్‌పర్ట్ యాజమాన్యం అని చెప్పుకుంటున్న సుబ్బరాయుడు, బాల నారాయణరెడ్డి కార్మికులను తొల గించడం దుర్మార్గమని చెప్పారు. సమస్యలుంటే అధికారులకు చెప్పుకోవడం ఆనవాయితని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో డిప్యూటీ సిఎం కి వినతి పత్రం అందజేశారని తెలిపారు. ఆ ఉద్దేశంతో కక్షగట్టి ముగ్గురిని తొలగించడం సరి కాదన్నారు. తొలగించిన కార్మికులను విధులకు తీసుకోవాలని అనేకసార్లు డిప్యూటీ కలెక్టర్‌కు, కలెక్టర్‌కు, జెసికి వినతి పత్రాలు అందజేశామన్నారు. జిల్లా అధికారులు స్పందించినా మేనేజ్‌మెంట్ పరిధిలో సబ్ కాంట్రాక్ట్ ర్ స్పందించకపోవడం దారుణమని చెప్పారు. తప్పని పరిస్థితుల్లోనే ఆందోళన నిర్వహించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా చెల్లించడం లేదని ఆరోపించారు. 549 ప్రకారం రూ.16వేలు ఇవ్వాల్సి ఉండగా కొందరికి రూ.10వేలు, మరికొందరికి రూ.12,403 మాత్రమే ఇస్తున్నారని విమర్శించారు. ఇచ్చే వేతనంలో కార్మికుల ద్వారానే ఇఎస్ఐ, పిఎఫ్ మొత్తం డబ్బులు కట్ చేస్తున్నారని తెలిపారు. ఈ విషయాల పైన అనేకసార్లు రిమ్స్ మేనేజ్మెంట్ దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. స్పందించకపోగా కక్షపూరితంగా కార్మికులను ఇబ్బంది పెట్టడం సరెంది కాదన్నారు. తొలగించిన శానిటేషన్ సూపర్‌వైజర్‌ను, ఇద్దరు సెక్యూరిటీ గాడ్స్ ను విధులకు తీసుకోవాలని డిమాండ్ చేశారు . వెంటనే జిల్లా అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేశారు. విధులకు తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ధర్నాలో సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు పి. వెంకటసుబ్బయ్య, చంద్రారెడ్డి, మున్సిపల్ యూనియన్ జిల్లా కోశాధికారి గోపి, కిరణ్, పవన్, మహేష్, హరి, ఇమాం, నరేంద్ర, నారాయణరెడ్డి, సుబ్బయ్య పాల్గొన్నారు.



పాతబస్టాండ్ వద్ద నిరసన తెలియజేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రకృతి వ్యవసాయంపై క్షేత్ర స్థాయి పరిశీలన

ప్రజాశక్తి - కడప అర్బన్

వ్యవసాయ శాఖ సంచాలకులు, ఉద్యానవన శాఖ అధికారులకు గురువారం ప్రకృతి వ్యవసాయం పై క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. పెండ్లిమర్రి మండలంలోని చెన్నం రాజుపల్లెలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. రైతు గంగిరెడ్డి పొలంలో ఏ గ్రేడ్ ప్రకృతి వ్యవసాయ మోడల్, ఎటిఎం మోడల్ విత్తన కార్యక్రమాలను అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ జిల్లా అధికారి సుభాషిణి, ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్ కుమార్, అదనపు డిపిఎం వసంతకుమారి, సురేష్ బాబు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎస్‌పి ఇ.జి. అశోక్ కుమార్ ఆదేశాల మేరకు, కడప డిఎస్‌పి ఎ. వెంకటేశ్వర్లు, సిఐ డి.కె.జావీద్, కడప ట్రాఫిక్ వారి ఉత్తర్వుల ప్రకారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐయు వై.జయరాములు గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ద్విచక్ర వాహనాలకు కాలుష్య ప్రమాణాల నిబంధనలు ఉల్లంఘించి బుల్లెట్ వాహనాల సైలెన్సర్‌లు మార్చి నడుపుతున్న వారికి జరిమానా విధించారు. బైక్‌ల సైలెన్సర్ లను తీసివేయించారు. మరోసారి శబ్ద కాలుష్యం చేసే ఇతర సైలెన్సర్‌లు వాడితే బైక్ సీజ్ చేస్తామని హెచ్చరించారు. మైనర్ డ్రైవింగ్ చేస్తున్న వారికి వారి పెద్దల సమక్షంలో లో కౌన్సెలింగ్ నిర్వహించి జరిమానా విధించారు.



సైలెన్సర్ తీయిస్తున్న ట్రాఫిక్ పోలీసులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌పి అశోక్‌కుమార్

పారదర్శకంగా బదిలీల కౌన్సెలింగ్ : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

పారదర్శకత, నిబంధనలే ప్రామాణికంగా తీసుకుని పోలీస్ సిబ్బంది సీనియార్టీ ఆధారంగా వారు కోరుకున్న చోటుకే ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ స్థాన చలనం చేశారు. గురువారం పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ముగ్గురు ఎఎస్‌ఐలు, 29 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 104 మంది కానిస్టేబుళ్లకు ఎస్‌పి కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించి బదిలీ చేశారు. ఒకే పోలీస్ స్టేషన్‌లో ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సిబ్బంది జాబితాను సిద్ధం చేసి కౌన్సెలింగ్‌కు పిలిచారు. ముందుగా ఐదేళ్లు పూర్తి చేసుకున్న సీనియార్టీ జాబితాను ప్రొజెక్టర్ పై ప్రదర్శించారు. జిల్లాలో ఉన్న సిబ్బంది ఖాళీలను అందులో చూపించారు. బదిలీల ప్రక్రియకు కొలమానమైన నిబంధనలు ఎస్‌పి స్పష్టంగా వివరించారు. అనంతరం సీనియార్టీ ప్రకారం నిబంధనలు అనుసరించి సిబ్బంది కోరుకున్న చోటుకి బదిలీ చేశారు. బదిలీల ప్రక్రియ యావత్తూ పారదర్శకంగా జరగడంతో సిబ్బంది సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి ఎన్.సుధాకర్, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ దారెడ్డి భాస్కర్ రెడ్డి, డిటిసి ఇన్స్పెక్టర్ వినయ్ కుమార్ రెడ్డి, జిల్లా పోలీస్ కార్యాలయం ఎఒ జ్యోతి, సూపరింటెండెంట్‌లు, సిబ్బంది, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉప్పు శంకర్ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యా సంస్థల్లో వ్యాపారం తగదు

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి

ప్రజాశక్తి - కడప అర్బన్

పుస్తకాల పేరుతో కార్పొరేట్ విద్యాసంస్థలు వ్యాపారం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి విమర్శించారు. గురువారం కార్పొరేట్ విద్యాసంస్థ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర ంలోని చైతన్య విద్యా సంస్థలు తరగతులు ప్రారంభం కాకముందే పుస్తకాలు అమ్ముతున్నారని తెలిపారు. చదువు పేరుని అడ్డుపెట్టుకుని విద్యార్థులను, విద్యార్థుల తల్లిదండ్రుల పైన బారం మోపి వేల, లక్షల రూపాయలు దోచుకుంటున్నారని చెప్పారు. జిల్లాలోనే కాకుండా తెలుగు రాష్ట్రాల్లో పుస్తకాల పేరుతో కోట్ల రూపాయలు దోపిడీ చేస్తూ, అధికంగా ఫీజులు తీసుకుంటూ ఎంతోమంది విద్యార్థుల ప్రాణాలను బలి తీసుకుంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర, జిల్లా విద్యాశాఖ అధికారులు ఏ మాత్రం వారిపై చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కార్పొరేట్ విద్యాసంస్థల శక్తులకు, ప్రభుత్వ విద్యాశాఖ అధి కారులు కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. జిల్లా విద్యాశాఖ అధికా రులు స్పందించి జిల్లాలోని అన్ని ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలో చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, కమిటీ సభ్యులు అభినయ్, కడప నగర్ కార్యదర్శి మోహన్, నగర నాయకులు అఖిలేష్, ధన పాల్గొన్నారు.

షర్మిల పర్యటనను విజయవంతం చేద్దాం : డిసిసి

ప్రజాశక్తి - కడప

ఈనెల 12న పిసిసి అధ్యక్షులు వై.ఎస్. షర్మిల కడప పర్యటనను విజయవంతం చేయాలని డిసిసి అధ్యక్షులు విజయ జ్యోతి పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ కో-ఆర్డినేటర్లు, డిసిసి కమిటీ సభ్యులు, మండల అధ్యక్షులు, మైనార్టీ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ షర్మిల కడప పర్యటన ఈనెల 12న ఉన్నట్లు తెలిపారు. పర్యటన సందర్భంగా 12న మధ్యాహ్నం 3:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు ఐఎంఎ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరవుతారన్నారు. కార్యక్రమంలో పార్టీ పదవులు పొందిన నాయకులతో వ్యక్తిగతంగా క్షేత్ర, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలలో పార్టీ బలోపేతం గురించి మాట్లాడతారన్నారు. పార్టీని బలపరచాలని, గ్రామాలకు సందర్శించాలని, స్థానిక సంస్థ ఎన్నికలకు సిద్ధం కావాలని నాయకులకు సూచనలు విజయ జ్యోతి చేశారు. తొలుత ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మొక్కలు నాటారు.



మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షులు విజయజ్యోతి


విగ్రహ ఏర్పాట్లు పనులో సూచనలిస్తున్న ఎమ్మెల్యే 'పుట్టా'

ఎన్‌టిఆర్ విగ్రహ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

మైదుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఎన్‌టిఆర్ విగ్రహ ఏర్పాట్లను గురువారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగంగా హైస్కూల్ ఆవరణలో అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ కాలువపై ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. త్వరలో విగ్రహాన్ని ప్రారంభిస్తామన్నారు. 13వ వార్డు టిడిపి నాయకుడు శివసూర్య పాఠశాల గిరి సమీపంలో అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని ఎమ్మెల్యే ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎపి రవీంద్ర, టిడిపి నాయకులు కిశోర్‌కుమార్, వైవి సుబ్బారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


విద్యార్థులతో జ్యోతి కంప్యూటర్ సెంటర్ యాజమాన్యం

కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంచుకుంటే ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రస్తుత పరిస్థితుల్లో కంప్యూటర్‌లో పరిజ్ఞానం పెంచుకుంటేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని రిటైర్డ్ ప్రిన్సిపల్ నర్సింహులు తెలిపారు. గురువారం స్థానిక కడప రోడ్డులోని జ్యోతి కంప్యూటర్ సెంటర్‌లో కంప్యూటర్ శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేక డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో పేద విద్యార్థుల కోసం నామమాత్రపు రుసుంతో వేసవి సెలవుల్లో కంప్యూటర్ శిక్షణ ఇవ్వడం సంతోషకరమన్నారు. కవి డ్యాన్స్ మ్యూజిక్ అకాడమీ సహకారంతో 40 మంది విద్యార్థులు కంప్యూటర్‌లో శిక్షణ పొందారని జ్యోతి కంప్యూటర్ సెంటర్ కరస్పాండెంట్ జ్యోతి తెలిపారు. పేద విద్యార్థులకు నామమాత్రపు రుసుంతో జ్యోతి కంప్యూటర్ సెంటర్‌లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కంప్యూటర్ శిక్షణను దిగ్విజయంగా పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో బిఎస్ఆర్ డ్రైవింగ్ స్కూల్ కరస్పాండెంట్ నాగేంద్ర, కవి డ్యాన్స్ మ్యూజిక్ అకాడమీ కరస్పాండెంట్ కవి వరప్రసాద్, కంప్యూటర్ ఉపాధ్యాయుడు వరున్ అలీఖాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

సతీష్‌రెడ్డిని కలిసిన మాజీ డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ సతీష్ కుమార్‌రెడ్డిని మాజీ డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా రాజకీయాలపై అంజాద్‌బాషా సతీష్‌రెడ్డితో సుదీర్ఘంగా చర్చించారు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి గట్టిగా తీసుకుపోయేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని సతీష్‌రెడ్డి కోరారు. ముస్లిం మైనార్టీలకు కూడా కూటమి ప్రభుత్వం ఎలాంటి ప్రయోజనాలు చేకూర్చలేదని, ఆ విషయాన్ని వారికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. వైసిపికి ప్రజల్లో అభిమానం తగ్గలేదన్నారు. ఇందుకు కారణం బుధవారం నిర్వహించిన వెన్నుపోటు దినం ర్యాలీనే అన్నారు. అనంతరం అంజాద్‌బాషా తన బంధువుల పెళ్లికి హాజరుకావాలని సతీష్‌రెడ్డికి పెళ్లి పత్రికను అందజేశారు. సతీష్ రెడ్డిని కలిసిన వారిలో కడప కార్పొరేటర్లు మహమ్మద్ షఫీ, అజ్మతుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ తోటా కృష్ణ, వేంపల్లె మండల వైసిపి ఉపాధ్యక్షుడు మునీర్, షేక్షావలి, మాజీ ఉప సర్పంచ్ మునీర్, బాబా షరీఫ్, షామీర్ పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా నేడు భరత్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - ఖాజీపేట


గోగు లక్ష్మీ భరత్

మైదుకూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా భూమాయపల్లె పంచాయతీకి చెందిన గోగు లక్ష్మీ భరత్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కార్యక్రమాన్ని మైదుకూరు జడ్‌పి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. తనను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా నియమించడం సంతోషంగా ఉందని భరత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కూటమి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తరలిన రావాలని భరత్ పిలుపునిచ్చారు

ఐదుగురు ప్రధానోపాధ్యాయులు బదిలీ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండల వ్యాప్తంగా ఐదుగురు ప్రధానోపాధ్యాయులు బదిలీలు జరిగినట్లు ఎంఇఒ ఓబులేసు తెలిపారు. ఆ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ మం డలంలోని సింహాద్రిపురం జడ్‌పి హైస్కూల్‌కు సతీష్ కన్నా, అంకాలమ్మ గూడూ రుకు అరుణ కుమారి, గురజాలకు చంద్ర శేఖర్‌రెడ్డి, హిమ కుంట్లకు కృష్ణవేణి, బలప నూరుకు మురళీకృష్ణ బదిలీ అయ్యారు.

ప్రజల స్వేచ్ఛకు ఏడాది పూర్తి

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

ఎపి ప్రజల స్వేచ్ఛకు ఏడాది పూర్తయిందని ఎమ్మెల్యే షాజహాన్ బాషా తెలిపారు. గురువారం స్థానిక బెంగుళూరు బస్టాండ్ సమీపంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 2024, జూన్ 4 ల్యాండ్, శాండ్, వైన్, శాండిల్ ఉడ్‌కు విముక్తి దినమని, ప్రజల ఆస్తులకు హక్కులు కల్పించిన దినమని, ప్రజాస్వామ్యం పునరుద్ధరించిన దినమని పేర్కొన్నారు. వెన్నుపోటు పొడవడం వైసిపి నైజమని చెప్పారు. గత వైసిపి అరాచకాలు, కూటమి ప్రభుత్వ అభివృద్ధిపై మాట్లాడాలంటే వేదిక చెప్పండని సవాల్ విసిరారు. వైసిపి నాయకులు ప్రజలకు వెన్నుపోటు పొడిచి లక్షల కోట్లు ప్రజాధనాన్ని దోచుకున్నారని విమర్శించారు. అవినీతిపరుల చరిత్ర ప్రభుత్వం వద్ద ఉందని, సమాజానికి పట్టిన చీడపురుగులు వైసిపి నాయకులని, మాట్లాడే నైతికత వారికి లేదని చెప్పారు. మదనపల్లె - చిత్తూరు మార్గంలో సుమారు 50 ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం చేసిన చరిత్ర వైసిపి నాయకులేదనని ఆరోపించారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులకు తూట్లు పొడిచి పక్కదారి పట్టించలేదా, వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం చేయలేదా అని ప్రశ్నించారు. ప్రజాసమస్యల పరిష్కారానికి ఒక్కరోజైనా సిఎంఒ నడిపారా, పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందించారా అని నిలదీశారు. వైసిపి జన్మ హక్కు వెన్నుపోటు అని, టివి యాంకర్ శ్యామ లతో యాంకరింగ్ చేయించడ హాస్యాస్పదమన్నారు

ఈ ఏడాదైనా ప్రారంభానికి నోచుకునేనా..!

రూ.2 కోట్లకు పైగా ఖర్చు - ఆటస్థలం అందుబాటులో లేక వ్యాయామానికి దూరమవుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - చాపాడు


చాపాడులో ప్రారంభానికి నోచుకోని నూతన భవనాలు

గత ప్రభుత్వ హయాం ప్రారంభంలో నిర్మాణాలు ప్రారంభించిన చాపాడు పాఠశాల నూతన భవనాలు నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. రూ.2 కోట్లపైగా వెచ్చించి నిర్మించిన భవనాలు వృథాగా ఉన్నాయి. అరకొరగా పూర్తయిన పాఠశాల భవనాలు అల్లరి మూకలు, మందుబాబులకు అడ్డాగా మారాయి. ప్రస్తుతం ఉన్న పాఠశాల ఆవరణలో ఆటస్థలం అందు బాటులో లేకపోవడంతో విద్యార్థులు వ్యాయామ తరగతులకు దూరంగా ఉంటున్నారు. ఈ ఏడాది జూన్ 12న పాఠశాలలను వేసవి శెలవుల అనంతరం పునఃప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు చేస్తోంది. ఇప్పుడైనా విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వీలైనంత త్వరగా నూతన పాఠశాల భవనాలను పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 2019లో నక్కలదిన్నె రోడ్డులో జిఎఎస్ హైస్కూల్‌కు సంబంధించిన 68/2ఏ/3ఎల్ సర్వే నెంబర్‌లోని 3.46 ఎకరాల భూమిలో నూతన పాఠశాల భవనాల నిర్మాణానికి ఆర్‌ఎంఎస్‌ఏ నిధుల ద్వారా రూ.54.8 లక్షలు, నాబార్డు నిధుల కింద రూ.1.20 కోట్ల నిధులు మంజూరు చేసి 13 గదులు నిర్మాణాన్ని చేపట్టారు. వీటిలో 8 గదులు నిర్మాణం పూర్తి కాగా, 5 గదుల నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయాయి. పాఠశాలకు ప్రహరీ నిర్మించారు. అనంతరం నాడు-నేడు నిధుల ద్వారా 5 తరగతి గదుల మంజూరు కాగా మూడు గదులను నిర్మించారు. దాదాపుగా రూ.2.30 కోట్లను వీటి కోసం వెచ్చించారు. చాపాడు హైస్కూల్‌ను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేశారు. ప్రస్తుతం పాత భవనాల్లోనే ఇంటర్మీడియట్‌ను కూడా కొనసాగిస్తున్నారు. పూర్తిస్థాయిలో నిర్మించిన ఎనిమిది గదుల్లో ప్రస్తుతం కరెంటు బోర్డులను మందుబాబులు పగలగొడుతున్నారు. పాఠశాల ఆవరణలో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆడదామా ఆంధ్ర కార్యక్రమం కోసం ఆటస్థలాన్ని అభివృద్ధి చేశారు. ప్రస్తుతం వర్షాలకు తిరిగి పిచ్చిమొక్కలు మొలచి అధ్వానంగా తయారైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన భవనాల నిర్మాణాలను పూర్తిస్థాయిలో బాగు చేసి విద్యార్థులకు అందుబాటులో తీసుకుని రావాలని పలువురు కోరుతున్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

10 నుంచి పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, జెవివి ప్రధాన కార్యదర్శి సునీత తెలిపారు. ఆ మేరకు గురువారం కార్యాలయంలో గోడపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత శిక్షణకు రాదలిచినవారు 97053 33305కు ఫోన్ చేసి పేర్లను నమోదు చేయించుకోవాలని తెలిపారు. అనుభవజ్ఞులైన టీచింగ్ ఫ్యాకల్టీతో శిక్షణ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెవివి ఉపాధ్యక్షులు వేంపల్లి రాజశేఖర్, అనంతకృష్ణ, అంజిరెడ్డి, గాయత్రి, హరి కేశవ్, భువన్, హైమావతి పాల్గొన్నారు

అస్తవ్యస్తంగా ఎపి ఫైబర్ నెట్ సేవలు

- అసౌకర్యంగా ఉందని వాపోతున్న వినియోగదారులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండల వ్యాప్తంగా ఎపి ఫైబర్ నెట్ సేవలు అస్తవ్యస్తంగా మారాయి. వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు నాణ్యమైన నెట్(డేటా) సౌకర్యంతోపాటు టెలివిజన్ వినోదానికి ఎపి ఫైబర్ నెట్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఇటీవల కాలంలో ఎపి ఫైబర్ నెట్ ద్వారా నెట్(డేటా) సక్రమంగా రాకపోవడంతోపాటు టీవీలలో తరచూ అంతరాయం కలుగుతోందని తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపో తున్నారు. బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నా తరచూ అంతరాయం ఏమిటని విని యోగదారులు ప్రశ్నిస్తున్నారు. కొన్ని గ్రామాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధికంగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై స్థానిక కేబుల్ ఆపరేటర్లను సంప్రదించినప్పటికీ ఏమాత్రం స్పందించడం లేదని విని యోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని ఎపి ఫైబర్ నెట్ సేవలకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని విని యోగదారులు కోరుతున్నారు.

ఏనుగుల దాడి నుంచి ప్రజలను కాపాడండి

ప్రజాశక్తి - వేంపల్లె

ఏనుగుల దాడి నుంచి ప్రజలను, రైతులను కాపాడాలని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కాలంలో రాష్ట్రంలో ఏనుగుల భీభత్సం ఎక్కువైందన్నారు. ఏనుగుల వల్ల అనేక మంది ప్రాణాలు కోల్పో తున్నారని తెలిపారు. పంట నష్టం ఎక్కువగా జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణాన్ని పరిరక్షించు కోవడం మనందరి ప్రథమ కర్తవ్యమన్నారు.

బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా జరుపు కోవాలని సిఐ నర్సింహులు కోరారు. గురువారం సాయంత్రం స్థానిక పోలీసుస్టేషన్‌లో బక్రీద్ పండుగ సందర్భంగా ఆయన శాంతి కమిటీతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రజ లందరూ శాంతియుతంగా శనివారం బక్రీద్ పండుగను జరుపుకోవాలని కోరారు. నిబంధనల మేరకు పోలీసులకు సహకరించాలన్నారు. వేంపల్లె గ్రామం మత సామరస్యానికి ప్రతీకగా ఉందన్నారు. మత పెద్దలు సహక రించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో ఎస్‌ఐలు రంగారావు, తిరుపాల్ నాయక్, పోలీసు సిబ్బంది, మత పెద్దలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సిఐ నర్సింహులు

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిద్దాం : జెవివి


ర్యాలీ నిర్వహిస్తున్న జెవివి నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిద్దామని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి రాజశేఖర్ రాహుల్ పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రామక్రిష్ణ నగర్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉర్దూ పాఠశాలలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనకు ఉన్నది ఒకే ఒక్క భూమిని రక్షించుకోవడానికి జనావళిని సమాయత్తం చేయడం కోసం ఈ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ప్లాస్టిక్ విచ్ఛిన్నం కావడానికి సుమారు 400 సంవత్సరాల కాలం పడుతుందని తెలిపారు. విచ్ఛిన్నమయ్యే క్రమంలో ప్లాస్టిక్, మైక్రో ప్లాస్టిక్, నానో ప్లాస్టిక్ గా విభజితమవుతుందని చెప్పారు. రెడ్యూస్ రీయూజ్, రీ సైకిల్ పద్ధతిని అనుసరించడం ద్వారా ప్లాస్టిక్ వాడకం తగ్గించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్షులు సమీర్ బాష, స్కూల్ కమిటీ అధ్యక్షులు మాబుబాష, శేఖర్, వెంకటేశ్వర్లు, సరస్వతి, సుబ్బమ్మ, కామేశ్వరమ్మ, డాక్టర్.చంద్ర ప్రసాద్, ఉపాధ్యాయుడు అబ్దుల్ గఫూర్, శేషయ్య, మధుసూదన్, లక్ష్మీదేవి, వెంకటరామ రాజు, కుమార స్వామి రెడ్డి పాల్గొన్నారు. **బద్వేలు :** మొక్కలు నాటుదాం- పర్యావరణాన్ని కాపాడుతూ ఆరోగ్యంగా జీవించాలని బద్వేల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని నెల్లూరు రోడ్డులో ఉన్న గ్రీన్ ఇండియా ఎలక్ట్రికల్ షోరూం వద్ద ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవ వేడుకలు ఈజీరైడ్ గ్రీన్ ఇండియా ఎలక్ట్రికల్ షోరూం ప్రొప్రైయిటర్ షేక్ అన్వర్ బాష, పర్యావరణ పరిరక్షణ ప్రేమికులు పెద్దిరెడ్డి సతీష్ రెడ్డి సంయుక్త ఆధ్వర్యాన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బద్వేలు జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కాలుష్య నివారణకు మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో మహనీయుల ఆశయాల సాధన సమితి వ్యవస్థాపకులు బద్వేలు గురుమూర్తి,పట్టణ అభివృద్ధి సొసైటీ అధ్యక్షులు నానబాల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు ఘనుమంత రాజేష్, ఆవాజ్ కమిటి జిల్లా అధ్యక్షులు ఛాంద్ బాష, ఎల్ఐసి సుబ్బారావు, రసూల్, అల్లాబకాష్, టి.వి మస్తాన్, జమాల్ వల్లి, మదరసా విద్యార్థులు పాల్గొన్నారు. **ముద్దనూరు :** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించి పర్యావరణాన్ని కాపాడాలని ముద్దనూరు సర్పంచ్ బోనం సరళ, ఎంపిటిసి లక్ష్మికాంతమ్మ సూచించారు. ప్రపంచ పర్యావరణం దినోత్సవం, వనమహోత్స కార్యక్రమంలో భాగంగా గురువారం సరళ, లక్ష్మికాంతమ్మ ఆధ్వర్యంలో డిఎన్ పల్లె సమీపంలోని చెత్త సంపద తయారీ కేంద్రం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పరిపూర్ణ అరుంధతి, డిప్యూటీ ఎంపిడిఒ వీరభద్రుడు, కార్యదర్శి లక్ష్మినరసింహులు, ఎపిఒ గంగయ్య, ఎపిఎం అపర్ణ దేవి, సిబ్బంది పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందాలంటే మొక్కలను నాటడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో సుందరయ్య నగర్‌లో ఉమెన్ ఫర్ ట్రీస్, మొక్కను నాటుదాం-భవిష్యత్తుకు జీవం పోద్దాం అనే కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ శేషఫణి ఆధ్వర్యంలో స్థానిక మహిళలతో ఈ కార్యక్రమం చేపట్టారు. రాజకీయ, వ్యాపార, ఉద్యోగ సంస్థలతోపాటు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమాన్ని అందరూ నిర్వహించనున్నారు. సుందరయ్య నగర్‌లోని మెయిన్ బజార్లో చివరి వరకు మొక్కలు ఇరువైపులా నాటారు. కార్యక్రమంలో న్యాయవాది జాకట దినేష్, స్థానిక మహిళలు పాల్గొన్నారు. **ఖాజీపేట :** ప్రతి ఒక్కరూ మొక్కలను విరివిగా నాటి సంరక్షించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సచివాలయ కార్యదర్శి పి.శ్రీనివాసులు సూచించారు. మండల పరిధిలోని భూమాయపల్లెలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **లింగాల :** మానవాళి మనుగడకు మొక్కలు ఎంతో దోహదం చేస్తాయని, ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని టిడిపి మండల అధ్యక్షుడు యమ్మనూరు విశ్వనాథరెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కమ్మవారిపల్లె శివాలయం ఆవరణలో గురువారం ఆయన ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని ఆలయ ఆవరణలో 500 మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ పోతిరెడ్డి వెంకట నారాయణరెడ్డి, మాధవరెడ్డి, ఉపాధి ఎపిఒ గంగరాజు పాల్గొన్నారు. **చాపాడు :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని లక్ష్మీపేట హైస్కూల్, అన్నవరం గ్రామ పంచాయతీలో మొక్కలు నాటారు. లక్ష్మీపేట హైస్కూల్ ఆవరణలో మండలస్థాయి అధికారులు, పాఠశాల సిబ్బంది ఉపాధి ఎపిఒ జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అన్నవరం హెల్త్ సెంటర్, మెయిన్ రోడ్డు ఇరువైపుల మొక్కలు నాటారు. మండల టిడిపి అధ్యక్షులు అన్నవరం సుధాకర్‌రెడ్డి, కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్ నంద్యాల లోకేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సచివాయ సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పి శృతి, హెల్త్ సిబ్బంది, యువకులు, ప్రజలు పాల్గొన్నారు. **వేంపల్లె :** పర్యావరణం కోసం ప్రతి ఒక్కరూ ఇళ్ల వద్ద మొక్కలను నాటాలని ఎపిఒ పార్వతి పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని ఆయా గ్రామాల్లోని గ్రామ సచివాలయాల వద్ద పంచాయితీ కార్యదర్శులు, వేంపల్లెలోని ఉపాధి హామీ పథకం కార్యాలయం వద్ద ఎపిఒ మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎఒ గంగిరెడ్డి, ఉపాధి హామీ పథకం, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** అందరం మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామి రెడ్డి పిలుపునిచ్చారు. వన మహోత్సవ దినంలో భాగంగా గురువారం మన వంతుగా కోటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని కమిషనర్ వెంకటరమణరెడ్డితో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, అధికారులు, ఎన్‌డిఎ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **దువ్వూరు :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం, వనమహోత్సవం సందర్భంగా జిల్లా అధికారుల ఆదేశాల మేరకు డిఆర్‌ఒ అన్వర్ హుస్సేన్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకుందాం అని పిలుపునిచ్చారు. వనిపెంట రేంజ్ అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. దువ్వూరు, నీలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రెండు వందలు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజలకు 200మొక్కలు పంపిణీ చేశారు. ఫారెస్టు అధికారులు సుచరిత, లింగారెడ్డి, మైదుకూరు నియోజవర్గ రైతు అధ్యక్షుడు కారపురెడ్డి సంజీవరెడ్డి, దువ్వూరు టిడిపి నాయకుడు పాపినేని రాంబాబు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాలలో పర్యావరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కరస్పాండెంట్ తరునేంద్ర శేఖర్, కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి , ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్, విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు సిబ్బంది మొక్కలు నాటారు.


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్లు, ప్రిన్సిపల్

శ్రీవిద్య విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన 2025 ప్రతిభ అవార్డులకు స్థానిక సూపర్‌బజార్ రోడ్డులోని శ్రీవిద్యా జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని ఆ కళాశాల ప్రిన్సిపల్ కెవిఒ రమణారావు తెలిపారు. ఆ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ ఎంపిసి విభాగంలో వై.గీతాంజలి 991, బైపిసి విభాగంలో వై.సఫియా 990 మార్కులతో వైఎస్సార్ కడప జిల్లా నుండి తమ విద్యార్థులు ప్రతిభ అవార్డులకు ఎంపికయ్యారన్నారు. వీరికి త్వరలో ముఖ్య మంత్రి చంద్రబాబు ప్రతిభా పురస్కారం, గోల్డ్‌మెడల్, నగదు బహుమతి అందజేస్తారన్నారు. ప్రతిభ వార్డులకు ఎంపికైన విద్యార్థినులకు కళాశాల డైరెక్టర్లు ఎస్ శ్రీకాంత్ కుమార్‌రెడ్డి, ఎం.రామ్మోహన్, దస్తగిరి అధ్యాపకులు అభినందించారు.


తల్లిదండ్రులతో విద్యార్థిని లావణ్య

'ఎస్‌పి' విద్యార్థి ప్రతిభా పురస్కారానికి ఎంపిక

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

సాయి పరమేశ్వర జూనియర్ కళాశాల విద్యార్థిని కుమారి జి.లావణ్య 2024-25 విద్యా సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే ప్రతిభా పురస్కారానికి ఎంపిక కావడం పట్ల కళాశాల కరస్పాండెంట్ పాల నాగేశ్వరరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మాట్లాడుతూ సాధారణ విద్యార్థులచే ప్రభంజన ఫలితాలు సాధించడంలో సాయి పరమేశ్వర జూనియర్ కళాశాల ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 393 మార్కులు సాధించి, ఇంటర్మీడియట్‌లో 933 మార్కులతో అందరినీ ఆశ్చర్యపరిచిన లావణ్య, నేడు ఈ ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎంపిక కావడం కళాశాలకు, జమ్మలమడుగు ప్రాంతానికి గర్వకారణమని ఆయన కొనియాడారు. ఈ సంవత్సరానికి గాను జమ్మలమడుగు తాలూకాలో ప్రతిభా అవార్డు అందుకున్న ఏకైక విద్యార్థిని తమ కళాశాల లావణ్య కావడం సంతోషాన్ని కలిగిస్తోందని నాగేశ్వర రెడ్డి తెలిపారు. ప్రతిభా పురస్కారాలు సాయి పరమేశ్వర కళాశాలకు కొత్తేమీ కాదన్నారు. గతంలో నాలుగు పర్యాయాలు తమ విద్యార్థులు ఈ పురస్కారాన్ని అందుకున్నారని, ఈ ఘనత సాధించిన ఏకైక విద్యాసంస్థ తమదేనని ఆయన గుర్తు చేశారు. ఈ విజయం వెనుక ఉన్న ప్రిన్సిపల్, అధ్యాపక బృందం ఉందని వారిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. వారి నిరంతర కషి, మార్గనిర్దేశనం వల్లే ఇలాంటి అద్భుత ఫలితాలు సాధ్యమవుతున్నాయని ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా మరెన్నో విజయాలు సాధించి, విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చడమే తమ లక్ష్యమని పాల నాగేశ్వరరెడ్డి పునరుద్ఘాటించారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలు మృతి

- మరో మహిళకు, డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - చింతాకొమ్మదిన్నె


మండలంలోని బుగ్గలేటిపల్లె సమీపంలో జాతీయ రహదారిపై గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డుప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు రాణికుమారి (52) మృతి చెందారు. వివరాలి ఉన్నాయి.. స్విఫ్ట్ డిజైర్ కారు రాయచోటి వైపు నుంచి కడపకు వస్తూండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. అదే వేగంతో స్విఫ్ట్ డిజైర్ కారు వెనుకకు మళ్లింది. స్విఫ్ట్ డిజైర్ కారును రాయచోటి వైపు నుంచి వెనుకగా వస్తున్న మరో వాహనం కారు వేగాన్ని అదుపుచేయలేక ఢీకొంది. ఈ ప్రమాదంలో స్విఫ్ట్ కారులో స్వయంగా వాహనాన్ని నడుపుతున్న కడప రాఘవేంద్ర టౌన్షిప్ నివాసి అయిన రామాపురం మండలం సరస్వతిపల్లె ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయురాలు రాణికుమారి అక్కడికక్కడే మృతి చెందారు. రాయచోటి వైపు నుంచి వస్తుండిన మరో కారులో ప్రయాణిస్తున్న మరో మహిళ, డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని రిమ్స్‌కు తరలించారు. రాణికుమారికి భర్త పుల్లయ్య, ఇరువురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తెలు విదేశాల్లో ఉన్నట్లు సమాచారం. రాణికుమారి కారులో నుండి హైవే పెట్రోలింగ్ కానిస్టేబుల్ నరసింహులు బ్యాగులను స్వాధీనం చేసుకుని అందులోని సుమారు 50 తులాలకుపైగా బంగారు ఆభరణాలతో కూడిన రెండు బ్యాగులను చింతకొమ్మదిన్నె పోలీసులకు స్వాధీనం చేయగా వారు సంఘటన ప్రాంతంలోనే మృతురాలి బంధువులకు అప్పగించారు. గాయపడిన దేవశిరోమణి కడప నగరంలోని రాజారెడ్డి వీధి నివాసురాలు, వీరి కారు డ్రైవర్ పెంచల బాబు కూడా కడప నివాసి. ఈ ప్రమాదంలో రెండు కార్లలోని ఎయిర్ బెలూన్లు తెరుచుకోకపోవడం గమనార్హం. చింతకొమ్మదిన్నె పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో చదిపిరాళ్ల విఆర్ఒ మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు - రెవెన్యూ అధికారిపై మృతుడి బంధువుల ఆగ్రహం

ప్రజాశక్తి - కమలాపురం టౌన్


ఈశ్వరయ్య (ఫైల్‌ఫొటో)

కడప-తాడిపత్రి జాతీయ రహదారిపై కమలాపురం మండల పరిధి లోని రామచంద్రపురం వద్ద గురువారం లారీ, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘ టన లో చదిపిరాళ్ల విఆర్ఒ ఈశ్వరయ్య(55) మృతి చెందాడు. మరోవ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కమలాపురం మండలం పాచికలపాడు గ్రామానికి చెందిన ఈశ్వర య్య చరిపిరాళ్ల విఆర్ఒగా విధులు నిర్వహిస్తున్నారు. మృతదేహాన్ని కమలాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకుని ఆస్పత్రికి చేరుకున్న రెవెన్యూ అధికారి శివరామిరెడ్డిపై మృతుడి బంధువులు దాడికి పాల్పడ్డారు. ఆరోగ్యం సరిగాలేదని చెప్పినా, వేరే సచివా లయానికి ఇన్‌ఛార్జిగా వేయడంతో సెలవు అడిగినా ఇవ్వలేదని ఈశ్వరయ్య బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

దుంపలగట్టులో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని దుంపలగట్టు గ్రామానికి చెందిన రెడ్యం నారాయణరెడ్డి (42) గ్రామ సమీప పొలాల్లో బుధవారం రాత్రి విద్యుత్ తీగలు పట్టుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల వివరాల మేరకు.. కొన్ని రోజుల క్రితం నారాయణరెడ్డి గంజాయి కేసులో అరెస్టు అయ్యాడు. పది రోజుల క్రితం బెయిల్‌పై వచ్చారన్నారు. నారాయణరెడ్డి ఎలాంటి నేరానికి పాల్పడలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. విచారణ కోసం పోలీస్‌స్టేషన్‌కు రావాలని పోలీసులు వచ్చి చెప్పారన్నారు. పోలీస్‌స్టేషన్ నుంచి ఇంటికి వచ్చి తనకు అవమానంగా ఉందని చెప్పి ఎంతో బాధపడ్డాడన్నారు. ఇంట్లో ఎంతకు కనిపించకపోగా వెతికే క్రమంలో పొలం వద్ద విద్యుత్ తీగల కారణంగా మృతి చెందినట్లు గుర్తించామన్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఉన్నతాధికారులు విచారించి, తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.